చీకటి తెరలు

శ్రీ అందే నారాయణస్వామి

1

రాధ మిషన్ కుడుతూవుంది. రాధ తమ్ముడు పదిహేనేళ్ళవాడు మిషన్ ప్రక్క కూర్చుని సూదితో చొక్కాకు కాజాలు తీస్తున్నాడు. లలిత చేత్తో యేదో గుడ్డ పట్టుకవచ్చి "అక్కా నువ్వు చూపించిన పువ్వు కుట్టడం సరిగా కుదరలేదు" అంటూ చేతిలోవున్న గుడ్డ రాధకు చూపించింది.

రాధ కుడుతూవున్న మిషను ఆపి ఆ పువ్వుం కుట్టవలసిన విధానం మరియొకతూరి చెప్పి గుడ్డమీద పెన్సిలుతో గుర్తులుపెట్టి యిచ్చింది.

"నువ్వు కుడితే అంత బాగా వుంటుంది మాకు కుదరదేం అక్కా!" అంది గుడ్డ తీసుకుంటూ లలిత.

"ఇదో బ్రహ్మాండమా! నేర్చుకుంటే మీకూ వస్తుంది" అంది రాధ.

"రెండు రోజులనించి తిప్పలుపడుతున్నా కుదరటంలేదు."

"ఓపికపట్టి నేర్చుకోవాలి మరి! తొందరపడితే యెట్లా?"

లలిత మిషన్‌దగ్గిరిగా చాపమీద కూర్చుని గుడ్డమీద రాధ పెట్టి యిచ్చిన గుర్తులప్రకారం పువ్వు కుడుతూ, "మిషన్ నేర్చుకుంటే యెన్నాళ్ళలో వస్తుంది అక్కా?" అని అడిగింది.

"నీ కెందుకమ్మా మిషను. నీకు యెటువంటి వుద్యోగస్తుడు, యెటువంటి ధనవంతుడు భర్తగా రానున్నాడో!" అంది రాధ.

"నేర్చుకుంటే తప్పా అక్కా! గుడ్డ కత్తిరించి చొక్కాలు అవీ కుట్టాలని నాకెంతో సరదా!" అంది లలిత.

"అయితే నేర్చుకో. రేపు నీభర్తకు చొక్కాలు, నీకు పుట్టేపిల్లలకు లాగులు, గౌనులు సొంతంగానే కుట్టుకోవచ్చు" అంది రాధ.

"నేర్చుకుంటే యెన్నాళ్ళలోవస్తుంది అక్కా!" అని అడిగింది లలిత.

"అది నేర్చుకునేవాళ్ళ శ్రద్ధనుబట్టి వుంటుంది. చొక్కాలు గౌనులు ఒకమాదిరిగా కుట్టడంవరకు అయిదారు మాసాల్లో రావచ్చు." అంది రాధ.

రాధ ఆ బజారులో కాపురంపెట్టి అయిదారు మాసాలైంది. ఆమెది యేవూరో, ఆమె స్థితిగతులేమిటో అక్కడి వాళ్లకు తెలియవు. రాధ వయస్సు దాదాపు యిరవైరెండేళ్ళుంటవి. తమ్ముడూ, తనూ తప్ప యింకెవరూ లేరు. రాధ, ఆ బజారులో గది అద్దెకు తీసుకుని మిషనుకుట్టడం మొదలు పెట్టింది. చొక్కాలూ, గౌనులూ అవీ కుట్టడమేకాకుండా అల్లికం పనిలోనూ చీరెలకూ పరికిణీలకు పువ్వులూ, లతలూ రంగు రంగుల దారాలతో అందంగా కుట్టడంలోనూ మంచి నేర్పరి. ఆ వీధిలో కొందరు ఆడపిల్లలు ఆమె దగ్గర కుట్టుపనీ, మొదలైనవి నేర్చుకుంటున్నారు. ఆ నేర్చుకొనేవాళ్లలో లలిత ఒకర్తె.

రాధనుగురించి యిరుగు పొరుగు అమ్మలక్కల్లో అనేక వూహాగానాలు బయలుదేరినవి. రాధను మొగుడు వదిలేస్తే యీ వూరువచ్చి మిషను కుట్టుకుంటుందని కొందరు, కాదు రాధే మొగుణ్ణి వదిలేసి యెవర్నో తీసుకుని లేచివచ్చిందనీ ఆ లేవతీసుకవచ్చినవాడు రాత్రిళ్ళు వచ్చిపోతూవుంటాడనికొందరూ, ఇట్లా పుకార్లు బయలుదేరినవి. ఆ వీధి చివర వెంకమ్మ అనే వితంతువు వున్నది. ఆమెకు వేరే పనిలేదు. ఇటువంటి వార్తలు గాలికంటే వేగంగా మోసుకుని యింటింటికీ వెళ్ళి అందచెయ్యడమే ఆమె పని. ఒకరోజున వెంకమ్మకు ఆమె సమవుజ్జీ అయిన శేషమ్మకు, నీళ్ళాటిరేవు దగ్గర రాధనుగురించిన వాద ప్రతివాదాలతో మాటలు ముదిరి జుట్లూ, జుట్లు పట్టుకోబోయ్యారు. అయితే రాధవచ్చిన కొత్తిలో వెంకమ్మ ఓ గుడ్డ పట్టుక వెళ్ళి "యిదుగో అమ్మాయ్! రవిక కుడితే యెంత తీసుకుంటావ్?" అని అడిగింది.

"మూడణాలు" అంది రాధ.

"అయ్యో! యిదేం చోద్యం! నీదగ్గర వూళ్ళో లేని గిరాకీ! బజార్లో రవిక కుడితే బేడ తీసుకుంటూ వుంటే మూడణాలంటావు!" అని దీర్ఘాలు తీసింది వెంకమ్మ.

"సరే! అలాగే యివ్వు అవ్వా," అంటూ రాధ గుడ్డ తీసుకుని వెంకమ్మకు రవిక కుట్టింది.

మర్నాడు వెంకమ్మ రవికకోసం వెళ్లి చేసినగోల అంతా ఇంతా కాదు. రవిక బిగువైందనీ, గుడ్డకాజేశావనీ అందుకనే బేడకు కుడతాననీ ఒప్పుకున్నావనీ తగువులాడి ఆఖరకు కుట్టుకూలి బేడ యివ్వకుండానే వెళ్ళిపోయింది. అప్పటినించీ రాధంటే వెంకమ్మకు అరికాలిమంట నెత్తికెక్కుతుంది.

2

రాధకు తనదగ్గర నేర్చుకునే పిల్లలంతా ఒక యెత్తు. లలిత ఒక యెత్తు. వాళ్లిద్దరికీ అంతమైత్రి కుదిరింది. లలిత యింటిదగ్గర గొంతులో మెతుకలు యేం వేసుకుంటుందో అంతే ఎప్పుడూ రాధ దగ్గిరేవుంటుంది. ఆరోజున లలిత రాధ దగ్గర కూర్చుని చీరెకు లతలు కుడుతూ అవి సరిగా కుదరకపోవడంవల్ల సతమతమవుతున్నది.

అప్పుడు మధ్యాహ్నం పన్నెండు కొవచ్చింది. రాధ మిషన్‌కుట్టడం ఆపి వసారాలోనించి లోనికి వెళ్ళి "లలితా!" అని పిలిచింది.

లలిత "ఏమిటక్కా!" అంటూ చేతిలో చీర అక్కడ పెట్టి లోనికి వెళ్ళింది.

"భోజనంచేద్దాంరా లలితా. ఆ పీటమీద కూర్చో. ఇవాళ్లి యేమైందనుకున్నావు రవికలు కుట్టించుకుని ఒకామె డబ్బులు యివ్వకుండా పాలు పోసింది. మావాడు యెన్నాళ్లనించో క్షీరాన్నం వండవే అక్కా అని పోరుపెడుతున్నాడు అందువల్ల యివాళ్లి క్షీరాన్నం వండాను. ఇద్దరం భోంచేద్దాంరా" అంది రాధ. లలిత మొహమాటపడుతూ "యెందుకులే అక్కా" అంది.

"అట్లాకాదు భోంచెయ్యకతప్పదు" అంటూ రాధ రెండుపళ్ళాల్లో క్షీరాన్నం వడ్డించింది. తప్పనిసరి అయినందువలన లలిత ఆ పూట అక్కడే భోజనం చేసింది.

తర్వాత నాలుగురోజులకు రాధ పెండ్లిబట్టలు తొందరగా వుండడంవల్ల రాత్రిపూట లాంతరుదగ్గర పెట్టుకుని మిషను కుడుతూవున్నది అప్పుడు లలితతల్లి రాగా రాధ కుడుతూవున్న మిషను ఆపి "లలితకోసం వచ్చావా పిన్నీ? లలిత యిందాకనే యింటికి వచ్చిందే!" అంది.

"లలితకోసంకాదు అమ్మాయ్! నీతో మాట్లాడదామని వచ్చాను." అంది ఆమె.

"అయితే ఆ పెట్టెమీద కూర్చో పిన్నీ" అని రాధ అనగా ఆమె అక్కడవున్న గుడలు వేసుకునే పెట్టెమీద కూర్చుని "లలితకు యెన్నాళ్ళనించో మంచి సమ్మంధాలకోసం వెదుకుతూవుంటే యెక్కడా దొరకటంలేదు అమ్మాయ్. ఇప్పుడు విజయవాడనించి ఓ మంచి సమ్మంధంవచ్చింది. అతగాడికి ఏదో వుద్యోగమట. రెండువందల జీతం కొద్దిగా పొలంకూడా వున్నదట. కుర్రవాడు లేతవాడే. ఈ మధ్యనే భార్య చనిపోయిందిట. కుర్రవాడు మంచి బుద్ధిమంతుడట. వాళ్ళ భార్యభర్తలు ఎంతో అన్యోన్యంగా వుండేవాళ్ళట. భార్య చనిపోవడంతో అతడు అన్నం నీళ్లూ మాని చింతపడుతూవుంటే స్నేహితులు అతణ్ని దారికితీసుకువచ్చారట. ఈ సంగతులన్నీ తెలిసినవి. ఈ సమ్మంధంపోతే మళ్ళా మంచి సమ్మంధాలు దొరకవు. రెండో పెళ్లయితే మాత్రమేం? నిక్షేపంలాంటి సమ్మంధం. ఇంటిపనులుచేసేటందుకు దాసీమనిషట. ఎంతసుఖం అనుకున్నావు అమ్మాయ్. యిదంతా నీకు ఎందుకు చెపుతున్నానంటే మా లలితగాని రెండో పెళ్ళని సందేహిస్తుందేమో. నువ్వుకాస్త నచ్చచెపుతావని నీతో చెప్పవచ్చానమ్మాయ్" అంది.

"అయ్యో! అంతకంటే ఇంకేంకావాలి పిన్నీ! మంచి సమ్మంధమయితే యెందుకు వదిలిపెట్టడం. లలితతో నేనుకూడా చెపుతాలే" అంది రాధ.

"చూశావా అమ్మాయ్! అతనికి యెంతోమంది పిల్లల్ని యిస్తామనివస్తున్నారట. యెంతమంది వస్తేనేం పిల్ల అతనికి నచ్చవద్దూ! అందులో బాగా చదువుకున్నవాడాయె! అయినా రూపంలో మన లలితకు వంక పెట్టేదెవరు? ఆ సమ్మంధం గనక కుదిరితే మన లలిత అదృష్టవంతురాలే! నువ్వుకాస్త చెప్పమ్మా" అని చెప్పి ఆమె వెళ్ళిపోయింది.

చీకటి తెరలు

మర్నాడు వుదయానే వాడుకప్రకారం లలిత వచ్చింది. లలిత వచ్చేసరికి కుట్టుపని నేర్చుకుంటున్న ఓ యిద్దరుఅమ్మాయిలు వచ్చి కుట్టుకుంటున్నారు. రాధ వాళ్ళందరికీ గుడ్డమీద పెన్సిలుతో లతలూ, పుష్పాలు, డిజైన్లు గీసియిచ్చి తాను మిషన్‌దగ్గర కూర్చుని కుట్టడం ప్రారంభించింది. కాసేపు కుట్టుకుని మొదటవచ్చిన యిద్దరమ్మాయిలూ వెళ్ళిపొయ్యారు. లలిత ఒక్కతే కుడుతూ "అక్కా! ఆకులకు ఆకుపచ్చ దారంతో కుట్టాను. కాడలకు పసుపు పచ్చ దారంతో కుడుతున్నాను." అంది.

"అలా నే కుట్టు" అంది రాధ.

కాసేపు ఆగి రాధ "నీ కేదో సమ్మంధం వచ్చిందటగా లలితా?" అని అడిగింది.

"అవునట అక్కా" అంది లలిత.

"నువ్వింకా వరుణ్ణి చూడలేదా?" అని అడిగింది రాధ.

"చూడలేదు అక్కా" అంది లలిత.

"నీకు చూపించకుండా యెలా చేస్తారులే! రెండో పెళ్లిని విన్నాను. కుర్రవాడు లేతవాడేనట. మనం చూడవలసింది కుర్రవాడి వయస్సు, ఆరోగ్యం. రెండో పెళ్లయితే నేం? మంచి సమ్మంధం అయితేసరి మొదటగా పెళ్ళిచేసుకున్నవాళ్లు మాత్రం యేం వరగపెడుతున్నారు? భార్యను నానా బాధలు పెట్టడం లేదు? నేను మొదటిపెళ్ళివాణ్ణే చేసుకుని ఏం బావుకున్నాను? నా జీవితం తీరని కష్టాలకు గురైంది" అని చెప్పింది రాధ.

ఈ కదలికతో వెనకటి స్మృతులు రాధ కళ్లల్లో మెదలజొచ్చినవి. తనకు యుక్తవయస్సు రాగానే తనతల్లి పినతండ్రి సహాయంతో తనకు సమ్మంధాలు వెదకడం మొదలుపెట్టింది. అసలు వాళ్ళది గుంటూరు. వాళ్ళ తల్లితండ్రులకు ముగ్గురు సంతానం. ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడు. తాను రెండోది. తన అక్కకు తండ్రి వుండగానే వివాహమైంది. తండ్రి కోర్టు అమీనా పనిచేసి యేమీ మిగల్చకుండా వెళ్ళిపొయ్యాడు.

తనకు యెన్నో సమ్మంధాలు చూశారు. ఆఖరకు తెనాలిలో వచ్చిన సమ్మంధం ఒకటి కుదరగా తనకు వివాహంచేశారు. వరుడు చదువుకున్నవాడు. కొద్దో గొప్పో ఆస్తికూడా వున్నది. జీవితంలో పెళ్ళికంటే ఆనందాన్నిచ్చే దేముంది? తనసంతోషానికి మేరలేదు. తానో గృహస్థురాలు అయిపోతున్నది. భర్తతో ప్రేమజీవితం గడపవచ్చును. ఇక ఆ ఇంటికి యజమానురాలు తానే. కలగబోయే సంతానం, వాళ్లు పెద్దవాళ్లయితే మళ్ళా వాళ్లకు పెళ్లిళ్లు. కోడళ్లతో, అల్లుళ్లతో ఇల్లంతా కలకలలాడుతుంది. దోసతోటలా గంపంత సంసారం. ఇవన్నీ తలుచుకుని పొంగిపొయ్యేది. ఏవేవో గాలిమేడలు నిర్మించుకుని ఆనందపడేది. పెళ్లి కాగానే తనను కాపరానికి పంపారు. ఎన్నో ఆశలతో, ఎన్నో కోర్కెలతో అత్తివారింట్లో అడుగుపెట్టింది. తనభర్త ప్రతిపనిదగ్గరా కోప్పడేవాడు. బూట్లదగ్గరనించి తుడిచి యివ్వవలసి వచ్చేది. ఆయన ఆఫీసునుంచి వచ్చేసరికి గడగడలాడుతూ యెదురువెళ్ళి అన్నీ అందివ్వాలి. ఏది కాస్త ఆలస్యమైనా మండిపడేవాడు. ఒకనవ్వూ లేదు, ఒక సరసమూ లేదు. ముఖం యెప్పుడూ ధుమధుమలాడుతూ వుండేది. భార్యాభర్తల మధ్య అనురాగం, ప్రేమ ఏమీ లేవు. తనను దాసీదానిలా చూసేవాడు. తను పుట్టింటి సరసన తహశీల్ దారుగారి ఇల్లువుండేది. ఆయన అంత ఉద్యోగి అయినా ఆఫీసునుంచి యింటికి రాగానే భార్యాభర్తలు యెదురు బల్లగా చెరో కుర్చీలో కూర్చుని నవ్వుతూ పేలుతూ యెంతో ఆనందంగా వుండేవాళ్ళు. వాళ్లు ఒకళ్ళమీద ఒకళ్లు యెంతో అనురాగంగా వుండేవాళ్లు. భార్య అరికాలికి ముల్లుగుచ్చుకుందంటే ఆయన గడగడలాడేవాడు. దాంపత్య జీవితమంటే తాను అంత సుఖప్రదమంగా వుంటుందనుకున్నది. తాను వెళ్ళిన కొత్తలో తనభర్త రాత్రిళ్ళు యింటివద్ద పడుకునేవాడే కాని తర్వాత తర్వాత రాత్రిళ్ళు యింటివద్ద పడుకోవడం మానివేశాడు. తాను ఒకరోజున తనఅత్తగారితో జంకుతూ మీ అబ్బాయి రాత్రిళ్లుయింటివద్ద పడుకోడంలేదని చెప్పింది.

అందుకు ఆమె "వాడు ఆఫీసు పనులమీద ఎక్కడికో వెళ్లుతూ వుంటాడు. ఆ పనులన్నీ మానుకొని నీకు యెదురుగా కూర్చోవాలంటావా?" అంది.

తాను యిక మారుమాట్లాడలేదు. ఆమెకు కొడుకు సంగతి యేమీ పట్టదు. ఆమెకు ఒకకూతురు వున్నది. ఆ వూళ్ళోనే యిచ్చారు. కూతుర్నీ, కూతురుపిల్లల్నీ దేవులాడడమే సరిపోతుంది. కాని కొడుకు

సంగతి సుతరామూ పట్టదు. ఒకరోజున తాను యిరుగు పొరుగువాళ్లతో కలిసి సినిమాకు వెళ్లింది. తనతోవచ్చిన పొరుగింటావిడ బెంచీలలో తమ ముందువరసలో కూర్చున్న ఓ అమ్మాయిని తనకుచూపిస్తూ "అదిగో మీ సవతి" అని చెప్పింది. అప్పుడు తనకు అంతా అర్థమయింది. తనభర్త తనను సరీగా చూడకపోవడానికి రాత్రిళ్ళు యింటికి రాకపోవడానికి కారణం యిదా అనుకున్నది. అప్పటికి తానువచ్చి ఆరు మాసాలేమో అయింది. పెళ్ళికి ముందునుంచే ఆవిణ్ణి పెట్టుకొని వుండాలి. అయితే ఆవిణ్ణి పెట్టుకున్నవాడు మళ్ళా పెళ్లెందుకు చేసుకోవాలి? తన తప్పులు పెళ్లిచాటున కప్పిపుచ్చుకోడానికి సంఘంలో మర్యాదకోసం పెళ్ళి చేసుకొని వుండాలి. అని తనలోతాను తలపోసుకుని విచారపడ్డది.

తర్వాత ఒకరోజున తాను పంచలో కూర్చుని బియ్యం బాగుచేస్తున్నది. తనఅత్త అవతల కూర్చుని కూతురు పిల్లకు అన్నం తినిపిస్తున్నది. ఇంతలో తన పుట్టింటి వూరినించి ఒక యువకుడు వచ్చి "మీఅమ్మ పూలూ దవనం పంపింది" అంటూ ఒక కాగితంపొట్లం తనకు యిచ్చి వెళ్ళిపొయ్యాడు. ఆవాళ ఆదివారం కావడంవల్ల తనభర్త యింటివద్దనే వున్నాడు. ఆ అబ్బాయి పూలూ అవి తెచ్చిఇవ్వడంచూసి "ఆ మనిషి యెవరు?" అని ప్రశ్నించాడు. తాను "మా యిరుగు పొరుగు అబ్బాయి" అని చెప్పింది.

"ఓహో! అదా! వాళ్ళయిల్లు మీ యింటికి యెంతదూరం? అతడు మీయింటికి తరుచు వస్తుండే వాడా?" అని గుచ్చి గుచ్చి తనను ఆరాలు తీశాడు. అతడట్లా ప్రశ్నిస్తూ వుంటే భార్యను ప్రేమించలేని వాళ్ళకు అనుమానాలు జాస్తి కామోసు అనుకున్నది. ఆయన అనుమానానికి తగ్గట్టు ఆ అబ్బాయి తరువాత రెండుసార్లు "మీ అమ్మ నీ యోగక్షేమాలు కనుక్కు రమ్మంది" అంటూ వచ్చాడు. ఆ అబ్బాయి తరుచు వ్యాపారం మీద తెనాలివస్తూ వుండడంవల్ల తన తల్లీ ఆ అబ్బాయితో చెప్పి వుండవచ్చు.

తర్వాత ఒకరోజున రాత్రి దాదాపు పదకొండు గంటలకు ఆయన తలుపు తట్టగా నిద్రలో వుండడంవల్ల తను ఆలస్యంగా తలుపు తీసింది. అప్పటికి భోజనాల వేళ దాటి పోవడంవల్ల ఆ వేళకు యిక రాడనుకుని తలుపులు వేసుకుని ఒళ్ళు మరిచి నిద్రపోతున్నది. తన అత్త అవతలి గదిలో పడుకున్నది. నిద్రలో ఆయన కేకలు వినపడక పోవడంవల్ల ఆలస్యంగా తలుపు తీసి వుండవచ్చు. అందుకాయన మండిపడుతూ "లోపల యెవరితో కులుకుతున్నావు? దొడ్డివాకిలిగుండా వాణ్ణి పంపడంలో ఆలస్యమయిందా?" అన్నాడు.

అప్పుడు తనకు దుఃఖం ముంచుకొచ్చింది. ఏమి సమాధానం చెప్పాలో తోచలేదు. ఆ రోజునుంచీ ఆయన తనతో మాట్లాడడం మానివేశాడు. కోపంతో అది చెయ్యమనీ యిది చెయ్యమనీ ఆ చెప్పడం కూడా లేదు. ఇక యేమి చూసుకుని తానక్కడ వుండాలి? సరీగా చూడక పోగా పైగా యీ అపవాదులు ఒకటి. తన కక్కడ వుండడానికి మనస్కరించలేదు. కొడుకూ కోడలూ సరీగా వుంటున్నారా లేదా అని తన అత్తకు యివన్నీ యేమీ పట్టవు. తన కూతురేమో తానేమో. ఒక రోజున తన అత్తతో చెప్పి తన పుట్టింటికి వచ్చి వేసింది. తన తల్లితో జరిగిన విషయాలన్నీ చెప్పింది తన తల్లి "యెట్లయినా ఓపికతో అక్కడే వుండాలి గాని యిట్లా రావచ్చునా?" అని కోప్పడి "నేను తీసుక వెళ్ళి దిగవిడిచివస్తా రమ్మ"న్నది.

అప్పుడు తాను "ఆయనకు అవసరం లేంది అక్కడపడి వుండడం దేనికమ్మా? ఆయనకు కావలసి వచ్చి యెప్పుడు తీసుకువెళ్లితే అప్పుడు వెళ్ళడానికి సిద్ధంగా వున్నానని" తన తల్లికి చెప్పింది.

తర్వాత తన పినతండ్రి సఖ్యత కుదర్చాలని తెనాలివెళ్లితే 'చెప్పకుండా లేచి పోయింది. మళ్ళా యిక్కడకు యెలా వస్తుంది' అని వాళ్లు తనను గురించి యేవేవో నిందా వాక్యాలు మాట్లాడారట.

తల్లి అక్కడ పునుగులూ, చక్రాలూ చేసుకుని జీవిస్తూవుంది. తాను ఒక పంతులమ్మ దగ్గిర కుట్టు మిషను నేర్చుకుని, యీ వూళ్ళో తమకు తెలిసిన వాళ్లు ఒకళ్లువుండంచేత యిక్కడకు వచ్చి తనతమ్ముణ్ణి పెట్టుకుని మిషను కుట్టుకుని జీవిస్తున్నది.

3

లలితసమ్మంధం స్థిరపడ్డది. ముహూర్తం కూడా నిశ్చయమయింది. పెళ్లివిజయవాడలో వరుడిగృహంలో జరిగేటట్లు నిర్ణయించుకోవడంవల్ల పెళ్లిరేపు కద్దనంగా లలిత కాళ్ళకు పారాణి కళ్లకు కాటుక బుగ్గన చుక్కతో పెళ్లికూతురై రాధ యింటికివచ్చి పెళ్ళికి రమ్మని రాధను ఆహ్వానించింది.

"ఈ శుభసమయంలో నీతో పాటువచ్చి నీ సంతోషంలో పాలుపంచుకునే స్థితిలో లేనమ్మా!" అని విచారంతో అన్నది రాధ.

లలిత యిక బదులు చెప్పలేకపోయింది.

ఆ మర్నాడు లలితకు విజయవాడలో వివాహం జరిగింది.

తర్వాత రాధ దగ్గిరికి లలితతప్ప తతిమ్మా పిల్లలు వచ్చి కుట్టుపని నేర్చుకుంటూనే వున్నారు. రోజులు గడిచిపోతున్నవి. ఒక రోజున పోస్టుజవాను రాధకు ఒక వుత్తరం యిచ్చి వెళ్ళిపొయ్యాడు. ఆ వుత్తరం చదువుకోగా విజయవాడనించి లలిత వ్రాసింది. అందులోని సారాంశం యిది.

అక్కా నిన్ను చూసి యెన్నాళ్ళో అయినట్లుంది. ఈ నెలరోజులబట్టి నిన్ను తలవని రోజు లేదు. ఒకసారి వచ్చిపోవలెను.

రాధ వుత్తరం చదువుకునేంతలో ఓ నడికారు దాటిన వ్యక్తి వచ్చాడు. తల నెరిసింది. కట్టుపంచె, చొక్కా, వుత్తరీయం సామాన్యమైన బట్టలు వేసుకున్నాడు. ఆ వ్యక్తిని రాధ చూసి ఆప్యాయంగా "రా రంగయ్య మావాఁ యెప్పుడు రావడం? యిలా కూర్చో" అంది.

అతడు అక్కడవున్న పెట్టెమీద కూర్చుంటూ "ఈ వూరు పనివుండివచ్చి నిన్ను చూసిపోదామని వచ్చానమ్మాయ్" అన్నాడు.

"ఇంటివద్ద విశేషాలేమిటి మావాఁ?" అనడిగింది రాధ.

"విశేషాలేమున్నై. మీ అమ్మకు మొన్న రెండు రోజులు జ్వరం తగిలింది. ఆస్పత్రికివెళ్ళి మందు తెచ్చుకుని తాగితే నయమయింది. ఆమెకేముంది. నీమీదే చింత. పెద్ద పిల్లేమో ఆవిడమావాన్ని ఆవిడ కాపురం చేసుకుంటూవుండె. యెప్పుడూ నిన్ను గురించే విచారపడుతూ వుంటుంది. నేను యిక్కడికి వస్తానని తెలిసి అమ్మాయి దగ్గిరికి కాస్తవెళ్ళి రా అన్నా" అని చెప్పింది. అయితే నీకిక్కడ బాగా వుంటున్నదా అమ్మా!" అని అడిగాడతడు.

"ఫరవాలేదు కుట్టుపని బాగానే వస్తున్నది" అంది రాధ.

"మీ నాన్న యెంతమంచివాడమ్మా! యెటువంటి దర్జాకలవాడమ్మా! ఆయనగనకవుంటే నీవు యిక్కడకు వచ్చి యిట్లా తిప్పలు పడవలసి వచ్చేదా?" అన్నాడతడు.

"కర్మ యెవరి వశం మావాఁ!" అంది, రాధ.

"అంతేనమ్మా అంతే! చేసుకున్న సమ్మంధం కూడా అట్లా తగలడాలా! నీ దగ్గరేమైనా డబ్బులున్నయ్యా అమ్మాయ్? మీ అమ్మ అడగమంది యెవరో బాకీ వాళ్ళు తొందర చేస్తున్నారట." అన్నాడతడు.

"పది రూపాయిలు వున్నై యిస్తా పట్టుకెళ్లు. మావాఁ అయితే మీ పార్వతి అత్తివారింటికి వెళ్ళిందా?" అని అడిగింది.

"ఆఁ వెళ్ళి పదిరోజు లవుతుందమ్మాయ్! సారె అదీ పెట్టిపంపేశాం. రెండో అమ్మాయికి కూడా సమ్మంధము కుదిరింది. యిక పెళ్ళి చెయ్యాలి" అన్నాడు.

"సమ్మంధం యెక్కడ కుదిరింది మావాఁ?" అని అడిగింది.

"పొన్నూరులో అమ్మాయ్. కుర్రవాడు చదువుకున్నవాడే. ఎక్కడా కట్నాలు! కిందబెట్టి మీదబెట్టి ఆఖరుకు అయిదువందలు కట్నానికి ఒప్పించేసరికి తాతలు దిగివచ్చారు. అయితే మీ తమ్ముడు యేడీ అమ్మాయ్?" అని అడిగాడు.

"ఒకళ్ళు కుట్టుకూలి ఇవ్వాల్సివుంటే అడిగిరావడానికి ఇప్పుడే వెళ్లాడు" అని చెప్పింది రాధ.

అతడు కాసేపు ఆమాటా ఈమాటా మాట్లాడి "డబ్బు ఇవ్వమ్మాయ్ యిక వెళతాను." అని అన్నాడు.

"భోజనం చేసి వెళ్లుదువుగాని మావాఁ" అని రాధ అనగా—"అమ్మమ్మ! యిప్పుడు భోజనం కాదు త్వరగా యిల్లు చేరుకోవాలి" అని రాధ దగర పది రూపాయలు పుచ్చుకుని వెళ్ళిపొయ్యాడు.

తర్వాత వారంరోజులకు పోస్టు జవాను రాధకు రెండు వుత్తరాలు యిచ్చి వెళ్లాడు. ఒకటి లలిత వ్రాసింది. రెండోది ముస్తాబాదనించి తన పినతండ్రి వ్రాసింది. లలిత వ్రాసిన వుత్తరంలోని సారాంశము యిది :

"అక్కా నీ చెల్లెలిమీద యింత శీతకన్ను వేయడము ధర్మంకాదు. రాత్రుళ్లు నీవు నా కలలోనే వుంటున్నావు. నేనుపరాధీననుఅయిపొయ్యాను. నేను

నిన్ను కలుసుకోవాలంటే మా పుట్టింటికి వచ్చినప్పుడు తప్ప వీలులేదు గాన నీవు తప్పక ఒకసారి వచ్చిపోవలయును. ఏమో వ్రాశానని అశ్రద్ధ చేయవద్దు. గాంధీ నగరంలో లక్ష్మీవిలాస్‌కు యెదురుగావున్న యిల్లేమాది అని వ్రాసింది.

రెండో వుత్తరం తన పినతండ్రి తనకు వంట్లో సరిగా వుండడం లేదనీ వచ్చి చూసివెళ్లమనీ వ్రాశాడు.

రాధకు బయలుదేరడం తప్పనిసరి అయింది. పెద తక్కెళ్లపాడునించి రైలెక్కితే ముస్తాబాదుకు రెండు గంటల ప్రయాణం. దారిలో విజయవాడలో దిగి లలితను కూడా చూసి ముస్తాబాద వెళ్ళవచ్చునని అనుకుంది.

ఆ మర్నాడు రాధ చీకటితో లేచి లాంతరు పెట్టుకుని తొందరగావున్న బటలను రైలు వేళదాకా కట్టి మిగతా గుడ్డలు కత్తిరించి కుట్టమని తమ్ముడికి అప్పగించి తాను రైలెక్కి విజయవాడలో దిగింది. రైలు దిగి టిక్కెటు గేటువద్ద యిచ్చి వంతెనమీదుగా నడిచి బండి కావాలాఅని యెదురువచ్చే గుర్రబ్బండి వాళ్లను రిక్షావాళ్ళను తప్పుకుని గాంధీనగరం స్టేషనుకు సమీపంలో ఉండడంవల్ల కాలినడకన బయలుదేరి లలిత వ్రాసిన అడ్రసు ప్రకారం వాళ్ళ యిల్లు వెతుక్కుంటూ వెళ్ళింది. రాధ వాళ్లయిలు సమీపించి లోపల అడుగు పెట్టేసరికి పంచలో కూర్చుని యేదో కుట్టుకుంటున్న లలిత రాధను చూసి సంతోషంతో "రా! అక్కా!" అంటూ ఒక్కగంతులో రాధకు యెదురువెళ్ళి "నిన్ను చూసి యెన్నాళ్లో అయినట్టుందక్కా" అని వసారాలోకి తీసుకవచ్చి "వారు లోపల లేరులే అక్కా యిప్పుడే బైటికి వెళ్ళారు." అంటూ ఆప్యాయంగా రాధను లోనికి తీసుకవెళ్ళింది. మధ్య హాల్లో నాలుగైదు కుర్చీలు ఓ డ్రాయరు వేసివున్నవి. గోడవ ఏవో చాలాపటాలు తగిలించివున్నవి. లలిత రాధను సరాసరి పెరట్లోకి తీసుకువెళ్ళి కాళ్లకు నీళ్ళిచ్చి ఆమె కాళ్లు కడుక్కున్నతర్వాత యిది వంటగది. యిది పడకగది అని లలిత రాధకు చూపించింది. తర్వాత యిద్దరూ మధ్యహాల్లోకి వచ్చారు. లలిత గోడనవున్న ఓ పటాన్ని రాధకు చూపిస్తూ "ఈ పటం చూశావా అక్కా! యిందులో వున్న పులినీ లేడినీ టేబిలుగుడ్డమీద కుట్టాలని చూస్తున్నాను. నీ చలువవల్ల యిప్పుడు బాగా కుట్టకలుగుతున్నాను." అని చెప్పింది.

రాధ ఆ పటాన్ని చూసి "అందులోవున్న చెట్లూ మొదలైన సీనరీ కుట్టులోకి రాకపోయినా పులినీ లేడినీ బాగాకుట్టవచ్చు."అంది అలా ఆపటాన్ని చూస్తూన్న రాధ దృష్టులు ఆవతలవున్న మరో పటంమీదికి మళ్లినవి. అది లలిత పెళ్లికి వాళ్ళ దంపతులు దిగిన ఫొటో. దంపతులిద్దరూ మెళ్ళో పూలమాలలతో వున్నారు. ఫొటో చూసేసరికి రాధకు గుండెఝల్లుమన్నంతపనైంది. తప్పి జారి యే ప్రలికుమాలోనో అడుగుపెట్టినట్లు కంపించిపోయింది. ఇక అక్కడ నిలవలేదు. చరచరా వీధిగుమ్మంవేపు నడిచిపోయింది. అక్క చేత ఆపటంలోని రెండు బొమ్మలూ గీయించి ఆమెచేతనే మొదలు పెట్టించాలి అని ఆలోచిస్తున్న లలిత అటు చూసేసరికి రాధ వీధిగుమ్మంలోకి వెళ్ళిపోయింది. లలిత "యెక్కడికి అక్కా!" అంటూ తాను కూడా వీధిగుమ్మంలోకి వెళ్ళింది. అప్పటికి రాధ గుమ్మందిగి రోడ్డెక్కి వెళ్ళిపోతున్నది. లలితకు యిదేమీ అర్థంకాలేదు. మాటా మందలింపు లేకుండా యెక్కడికి వెళ్ళుతున్నట్టు అనుకుని "అక్కా! అక్కా!" అని బిగ్గరగా కేక వేసింది.

రాధ తిరిగైనా చూడకుండా వెళ్లిపోసాగింది. వచ్చి కాసేపైనా కాలేదు. అక్క అట్లా యెందుకు వెళ్లిపోతున్నదో అర్థంకాక లలిత గుమ్మంలో కొయ్యబొమ్మలా నిలబడిపోయింది!